క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సన్యాసి నాయుడును సత్కరిస్తున్న నాయకులు

గుర్ల: మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆపార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన పొట్నూరు సన్యాసినాయుడు తెలిపారు. పాలవలసలో ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. అనంతరం సన్యాసినాయుడు మాట్లాడుతూ అర్హులకు పింఛన్ అందించడంలో కూటమి ప్రభు త్వం విఫలమైందని ఆరోపించారు. మండలం 280 మంది వితంతువులకు పింఛన్ మంజూరు కాలేదని చెప్పారు. అలాగే ఉపాధి హామీ వేతనదారులకు వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, నాయకులు బెల్లాన బంగారునాయుడు, వరదా ఈశ్వరరావు, జమ్ము స్వామినాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం, కెంగువ మధుసూదనరావు, ముద్దాడ శ్రీనివాసరావు, బూర్లె శ్రీను, కెల్ల సురేష్ పాల్గొన్నారు.

రంగవల్లుల పోటీలు



ముగ్గుల పోటీల్లో విజేతలను ప్రకటిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వేపాడ: అంకాజోస్యులపాలెంలో గ్రామదేవత మరిడిమాంబ పండగ నేపథ్యంలో యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ,ద్వితీయ,తృతీయ, నాలు గో స్థానంలో నిలిచిన వారికి అమ్మవారికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మంగళవారం అమ్మవారి పండగ రోజున వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

కొత్త వెలగాడలో శివగణేష్ ఉత్సవాలు



ఘటాలతో ఊరేగుతున్న గ్రామస్తులు

గంట్యాడ: మండలంలోని కొత్త వెలగాడ గ్రామంలో దక్షిణ కాళీ శివగణేష్ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 500 ఘటాలతో గ్రామస్తులతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

చిత్తశుద్ధితో గ్రామసభలు నిర్వహించండి



కృష్ణాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న సూర్యారావు

శృంగవరపుకోట: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి జరగనున్న గ్రామసభలను రాజ్యాంగ స్ఫూర్తితో నిజాయితీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు సూర్యారావు కోరారు. మండలంలో సోమవారం గ్రామ సభలు నిర్వహించనున్న ఆరు పంచాయతీల్లో ఒకటైన కృష్ణాపురం గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు గ్రామసభలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామసభ జరగనుందన్న సమాచారం తెలుసా అని అడగగా తమకు ఎవ్వరూ చెప్పలేదని గ్రామస్తులు బదులిచ్చారు. గ్రామసభకు రెండు రోజులు ముందుగా ఊరిలో దండోరా వేయించి, గ్రామసభలో గ్రామస్తుల అందరి భాగస్వామ్యం ఉండేలా చూడాల్సిన బాధ్యత, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓలపై ఉందని సూర్యారావు అన్నారు. గ్రామసభలు నిర్వహించాల్సిన గ్రామాల్లో గ్రామస్తులకు కనీసం సమాచారం ఇవ్వకుండా సభలు నిర్వహించడం రాజ్యాంగ ద్రోహమని అన్నారు. ఉద్యోగులు చిత్తశుద్ధితో గ్రామసభల్లో ప్రజలను భాగస్వామ్యులను చేసి, అంబేడ్కర్ ఆశించిన రాజ్యాంగస్ఫూర్తిని, పారదర్శకతను పాలనలో చూపాలని కోరారు.

బడి బాట



ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

గుర్ల: పెద్దబంటుపల్లిలో ఆ గ్రామ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం 'బడి బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతో ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం చెప్పారు.

మిగులు పనులు పూర్తయ్యేనా...?

- ఎస్.కోట నియోజకవర్గంలో అసంపూర్తిగా 27 సచివాలయ భవనాల నిర్మాణం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- 90 శాతం పనులు జరిగిన వాటినే పూర్తి చేయాలని, మిగిలినవి నిలిపి వేయాలని ఆదేశాలు



ఎల్.కోట మండలంలో 90 శాతానికి పైగా పనులు పూర్తయిన సీతారాంపురం గ్రామ సచివాలయ భవనం



కోర్టు కేసుతో నిలిచిపోయిన కొత్తవలస సచివాలయం-2 భవన నిర్మాణ పనులు



ఎల్.కోట మండలంలో 90 శాతానికి పైగా పనులు పూర్తయిన వీరభద్రపేట సచివాలయం

90శాతం పనులు జరిగిన వాటికే అనుమతులు

గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు 90 శాతం జరిగిన వాటినే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మిగిలినవి నిలిపివేయాలని ఆదేశించారు. ప్రారంభం కాని పనులను పూర్తిగా రద్దు చేయాలని ఆదేశాలు వచ్చాయి.

– సీహెచ్.స్వామినాయుడు, పంచాయతీరాజ్ డీఈ

కొత్తవలస: ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 అక్టోబర్ -2వ తేదీన సచివాలయ వ్యవస్థను తీసు కొచ్చింది. 2వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. వాటి నిర్వాహణకు శాశ్వత సొంత భవనాలు అవసరమని భావించిన నాటి ప్రభుత్వం నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అప్పటి వరకు గ్రామ పంచాయతీలకు ఓ చిన్న భవనం కావాలి అంటే జిల్లా పరిషత్ కార్యాలయం చుట్టూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రదక్షిణలు చేస్తే....మండలానికి ఒకటో,రెండో మంజూరయ్యేవి. 2019కు ముందు అలాంటి పరిస్థితులు ఉంటే...2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల స్వరూపం మారింది. ప్రతీ రెండు వేల జనాభాకు ఒక సచివాలయ భవనాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టైప్ వన్ సచివాలయ భవన నిర్మాణానికి రూ.48 లక్షలు, టైప్ 2 సచివాలయ భవన నిర్మాణానికి రూ.25 లక్షలు చొప్పున నిధులు విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలోనే 90 శాతం భవనాల నిర్మాణం పూర్తి కావడం, వాటిలో కార్యకలాపాలు ప్రారంభించడం జరిగింది. పలు కారణాలతో పాటు ఎన్నికలు సమీపిం చడంతో ఎస్.కోట నియోజకవర్గంలో కొన్ని భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి.అయితే కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు గడిచిపోయినా మిగిలిన పనులను పూర్తి చేయించలేక పోయింది. ఆ పనులను పూర్తి చేస్తే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ మంచిపేరు వచ్చేస్తుందోనన్న కుటిల ఆలోచనతో ఆంక్షలు విధించింది.

కొన్ని నిర్మాణాలపై కేసులు

సచివాలయ భవన నిర్మాణాలకు అప్పటిలో ప్రతిపక్షం ఉన్న టీడీపీ అడుగడుగునా అడ్డుపడింది. కొన్ని గ్రామాల్లో సచివాలయ భవన నిర్మా ణాలపై టీడీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారు. కొత్తవలస సచివాలయ భవనం-2తో పాటు ఎస్.కోట మండలంలో రెండు భవనాల నిర్మాణం నిలిచిపోయింది.

104 భవనాలకు రూ.34.40 కోట్లు

శృంగవరపుకోట నియోజకవర్గంలో 104 సచివాలయ భవనాలకు గత ప్రభుత్వం రూ.34.40కోట్లు మంజూరు చేసింది. వీటిలో 74 నిర్మాణాలు పూర్తయ్యి, కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. 27 భవనాల నిర్మాణాలు ఎన్నికల సమయానికి వివిధ దశల్లో నిలిచిపోగా, మూడు చోట్ల పదిశాతానికి మించి పనులు కాలేదు. ఎల్.కోట మండలంలో 23 భవనాల నిర్మాణానికి రూ.8.15 కోట్లు మంజూరు కాగా 20 భవనాలు పూర్తయ్యాయి. మూడు చోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. జామి మండలంలో 20 భవనాలకు రూ.3.50 కోట్లు మంజూరు కాగా తొమ్మిది పూర్తయ్యాయి.11 వివిధ దశల్లో ఉన్నాయి. వేపాడ మండలంలో 18 భవనాలకు రూ.6.75 కోట్లు మంజూరు కాగా 14 పూర్తయ్యాయి. మూడు పురో గతిలో ఉన్నాయి. ఒక భవనం పనులు ప్రారంభమే కాలేదు. కొత్తవలస మండలంలో 21 భవనాలకు రూ.7.55 కోట్లు మంజూరు చేయగా 20 పూర్తయ్యాయి. ఒక చోట పనులు ప్రారంభం కాలేదు. శృంగవరపుకోట మండలంలో 22 భవనాలకు రూ.8.45 కోట్లు మంజూరు కాగా 11 పూర్తయ్యాయి. పది పురోగతిలో ఉండగా, ఒక చోట పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కొంతమంది కాంట్రాక్టర్లకు బిల్లులు జమకాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పైసా కూడా కాంట్రాక్టర్లకు చెల్లించలేదు. దీంతో సంబంధిత కాంట్రా క్టర్లు మిగులు పనులను పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు. అలాగే నిలిచిపోయిన భవనాలను పూర్తి చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు జరిగిన వాటిని మాత్రమే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 10 శాతం పను లే జరిగిన భవనాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు. అధికారులు చెప్పిన లెక్క ప్రకారం నియోజక వర్గంలో 8 భవనాలు రద్దయ్యే అవకాశం ఉంది.

బెల్లానకు శుభాకాంక్షలు



బెల్లానకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లిరూరల్: విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ రాష్ట్ర వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ)సభ్యుడిగా నియమితులయ్యారు. ఆయన్ని చీపురుపల్లిలోని నివాసంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనం తం, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసుల నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనా యుడు, పట్టన ప్రెసిడెంట్ పతివాడ రాజారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు గెరిడి రామదాసు, రఘుమండ త్రినాథ్, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, తమ్మిన శేఖర్, బూరాడ మహేష్, రాము, అప్పారావు, ప్రభాత్‌కుమార్, వాసుదేవరావు, యగ్నేష్, నాగచైతన్య, వెంకీ,సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి పుట్టినరోజు వేడుకలు



గజపతినగరం రూరల్: కేక్ కట్‌చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం రూరల్: రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుక లను మండల కేంద్రానికి సమీపంలోని ఓప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి కేక్ కట్‌చేసి నాయకులకు పంచిపెట్టారు. నాయకులు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం

బొండపల్లి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన భార్య లక్ష్మీ సింధూ ఒంపల్లి గ్రామంలోని బ్రైట్ ఫ్యూచర్ అనాథ ఆశ్రమంలో 200 మంది పిల్లలకు ఆదివారం అన్నదానం చేశారు. ముందుగా పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు.

జేబు దొంగల చేతివాటం

బొండపల్లి: మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు బోడసింగిపేట గ్రామంలోని ఓప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. మంత్రిని పార్టీ శ్రేణులు ఊరేగింపుగా ఫంక్షన్ హాల్ వద్దకు తీసుకువచ్చి గజమాలతో సత్కరించారు. ఓ వైపు ఈ కార్యక్రమం జరుగు తుండగా జేబు దొంగలు తమ చేతివాటం చూపించారు. కొంత మంది టీడీపీ నాయకుల పర్సులను దొంగిలించారు. విషయాన్ని టీడీపీ నాయకులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

వైభవంగా ఆలయాల వార్షికోత్సవం



గుర్ల: భూపాలపురం రామమందిరంలో హోమం చేస్తున్న భక్తులు



దత్తిరాజేరు: గడసాం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న భక్తులు

గుర్ల: భూపాలపురంలో శ్రీరామ మందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ఆధ్వ ర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు.

గడసాంలో..

దత్తిరాజేరు: గడసాం గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఇనుగంటి సురేష్‌కుమార్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణం జరిపించి, ఉత్సవ విగ్రహా లను ఊరేగించారు.

నేటి నుంచి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో..

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈనెల14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఆదుర్తి రామకృష్ణ, అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆదివారం తెలిపారు. సోమవారం ఘటాలు, ప్రభలతో అమ్మవారికి పూజలు, అనంతరం శివపా ర్వతుల కల్యాణం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం అన్నదానం, 16న ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



వేపాడ: బక్కునాయుడుపేటలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న గురుకులాల అడిషనల్ సెక్రటరీ సునీల్‌కుమార్‌రాజు



చీపురుపల్లిరూరల్: చీపురుపల్లిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వేపాడ: గురుకుల పాఠశాలల్లో అయిదోతరగతి, ఇంటర్‌ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల బాలికల పాఠశాల కేంద్రంగా ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 123 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 89 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 76 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 61 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను ఉప తహసీల్దార్ సన్యాసి నాయుడు, గురుకులాల అడిషనల్ సెక్రటరీ సునీల్ రాజుకుమార్ పరిశీలించారు.

చీపురుపల్లిలో..

చీపురుపల్లిరూరల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల వేదికగా ఆదివారం నిర్వహించిన గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఉదయం నిర్వహించిన పరీక్షలకు 228 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 144 మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 195 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 144 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ రాణిశ్రీ తెలిపారు. పరీక్షలను గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి, స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్ పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కళ్లేపల్లి-రేగ ఉన్నత పాఠశాల 2005-06 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి-రేగ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదు వుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాల వేదికగా ఆదివారం జరిగింది. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదివిన తరగతి గదులు, పరిసరాలను చూసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటిలో పాఠాలు చెప్పిన 12 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం అంతా కలిసి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు.

ఇంటర్ ఫలితాల్లో ఆదర్శం

- రాణించిన మోడల్ స్కూల్, కేజీబీవీ, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు



తాడ్డి తనూజ, (బైపీసీ 987) | ఏ.పార్వతి, (ఎంపీసీ 981) | వి.భాగ్యలక్ష్మి, జి.పావని (ఎంపీసీ 453) | మండల సౌమ్య (బైపీసీ 967) | బొత్స తులసి (ఎంపీసీ 435)



కొక్కెర పూజిత (830) | చింతల మేరీ సుప్రియ (799) | వారాది వాణి (736) | బూరాడ చాందిని (773) | చల్లా శర్వాణి (682) | చప్ప సాయి జాహ్నవి (392)



కోరుకొండ శిరీష(337) | ఆర్.హారిక (ఎంపీసీ 936) | పి.శ్రావ్య (బైపీసీ 944) | ఆర్.రమాదేవి (ఎంపీసీ 929) | కె.స్రవంతి (బైపీసీ 892) | జమ్ము రేవతి (ఎంపీసీ 464)

మెరకముడిదాం: మండలంలోని గర్భాం ఆదర్శ పాఠశాల(మోడల్‌స్కూల్) విద్యార్థులు శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని తాడ్డి తనూజ 987/1000 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఏ.పవిత్ర 981/1000 మార్కులతో మండల ద్వితీయ టాపర్‌గా నిలిచింది. ప్రథమ సంవత్సర విద్యార్థులే కూడా ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంఈసీలో పి.సత్యవతి 466 మార్కులు, ఎంపీసీలో వి.భాగ్యలక్ష్మి, జి.పావని 453 మార్కులు సాధించారు. పాఠశాల నుంచి ప్రథమ సంవత్సరం పరీక్షలకు 108 మంది హాజరుకాగా 100 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 89 మంది పరీక్షలకు హాజరుకాగా, 86 మంది ఉత్తీర్ణులయ్యారు.

సత్తా చాటిన సోమలింగాపురం కళాశాల విద్యార్థులు

సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 75 మంది హాజరు కాగా 63 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 62 మంది హాజరుకాగా 61 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకెండియర్ బైపీసీ విద్యార్థిని మండల సౌమ్య 967 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలవగా అదే గ్రూపునకు చెందిన లెంక కల్యాణి 933 మార్కులతె ద్వితీయస్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బొత్స తులసి 435 మార్కులతో ప్రథమస్థానంలో, బైపీసీ విద్యార్థిని దేవదత్తి నీలవేణి 410 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచింది.

శతశాతం ఉత్తీర్ణత సాధించిన కేజీబీవీ

మెరకముడిదాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. 15 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 14 మంది విద్యార్థులకు 12 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని బి.రమ్య 899 మార్కులు సాధించింది.

ధర్మవరం విద్యార్థినుల ప్రతిభ

శృంగవరపుకోట: ధర్మవరం గ్రామంలోని బాలికల జూనియర్ కళాశాల (ప్లస్ టూ స్కూల్) విద్యార్థినులు ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించారని హెచ్‌ఎం. బి.ఉమామహేశ్వరరావు ఆదివారం చెప్పారు. సీనియర్ ఇంటర్మీడియట్‌లో 10 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా 9మంది ఉత్తీర్ణత సాధించారని, బైపీసీలో ఏడుగురు పరీక్ష రాయగా శతశాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. సెకెండియర్ బైపీసీలో కొక్కెర పూజిత(830), చింతల మేరీ సుప్రియ(799) వారాది వాణి(736), ఎంపీసీలో బూరాడ చాందిని(773), చల్లా శర్వాణి(682) మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సర ఎంపీసీలో చప్ప సాయిజాహ్నవి(392), కోరుకొండ శిరీష(337 మార్కులు సాధించారు.

మెరిసిన మోడల్ స్కూల్ విద్యార్థులు

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మెరిశారు. ప్రథమ సంవత్సరంలో 19 మం ది పరీక్షలకు హాజరు కాగా 17మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీ య సంవత్సరం విద్యార్థినులు 31మంది పరీక్షలకు హాజరు కాగా 29 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకెండియర్ బైపీసీ విద్యార్థిని పి.శ్రావ్య 944 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఎంపీసీలో ఆర్.హారిక 936 మార్కులు సాధించింది. అలాగే కేజీబీవీలో ప్రథమ సంవత్సరం విద్యార్థినులు 26 మంది పరీక్షలకు హాజరు కాగా 18 మంది ఉత్తీర్ణులయ్యార ని ఎస్‌ఓ హైమావతి తెలిపారు. సెకెండియర్ విద్యార్థినులు 20 మంది హాజరుకాగా 16 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకెండియర్ ఎంపీసీలో ఆర్. రమాదేవి 929 మార్కులు, బైపీసీలో కె.స్రవంతి 892 మార్కులు సాధించారు.

కె.పాలవలస విద్యార్థిని ప్రతిభ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కె.పాలవలస గ్రామానికి చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని జమ్ము రేవతి ఎంపీసీలో 464/470తో ఉత్త మ ప్రతిభ కనబరిచింది. ఈ విద్యార్థిని విశాఖపట్నంలోని చదువుతోంది.

చట్టాలపై అవగాహన



సోంపురంలోని ఎరుకులవీధిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ దేవి

వేపాడ: సోంపురం గ్రామంలోని ఎరుకుల వీధిలో స్థానికులకు వల్లంపూడి ఎస్‌ఐ బి.దేవి పోక్సో, మహిళల రక్షణ, తదితర చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే జైలు శిక్ష తప్పదన్నారు. రోజు రోజుకీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాల సమాచారం, ఏటీఎం నంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు. జీవితాలను నాశనం చేసే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, విద్యార్థులు, యువతకు సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య ఉన్నా, ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా సంచరించినా తక్షణమే గ్రామ మహిళా పోలీసుకు సమాచారం అందించాలని సూచించారు.

నైతిక విలువలు అలవర్చుకోవాలి

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలని, క్రమశిక్షణ, పెద్దలపట్ల గౌరవంతో మెలగాలని సోంపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు అన్నారు. ఆదివారం ఆ పాఠశాలలో విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. వల్లంపూడి ఎస్‌ఐ బి.దేవి అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎం.గౌరీ, ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.